జల్సా పురుషుడు

రామలింగేశ్వర్రావు, గోవర్ధనం ఇద్దరూ గుంటూరు హిందూ కాలేజీలోనే చదువుతున్నారు. హాస్టల్లో కూడా ఇద్దరూ ఒక రూంలోనే ఉంటూంటారు ఆ హాస్టల్లో అంతే. రూంకి ఇద్దరేసి వుంటారు. రామలింగేశ్వర్రావుకీ, గోవర్ధనానికీ మధ్య ఏ విషయంలోనూ అరమరికలు లేవు. మిత్రులిద్దరూ బహుసన్నిహితంగా వుంటూవుండేవాళ్ళు. అవి కాలేజీ తెరిచిన కొత్త రోజులు.

రామలింగేశ్వర్రావు బీదవాడు. వాళ్ళ నాన్న చందాలడిగీ, ఇంకా ఎన్నో బాధలు పడీ వాణ్ణి చదివిస్తున్నాడు వాడు ఈ కాస్త డిగ్రీ సంపాయిస్తే, అవతల మేనమామ - కాస్త డబ్బూ పలుకుబడీ గలవాడు - తన కూతుర్నిచ్చి పెళ్లిచెయ్యటమే కాక, ఏదో వుద్యోగం చూపిస్తాడని ఆయన తాపత్రయం. రామలింగేశ్వర్రావు కూడా, తెలివిగా, కింద క్లాసులు పాసయినాడు. ఇంటర్ కూడా అట్లాగే నెగ్గాడు. 'అట్లాగే' అంటే తేలికగా అని అర్థం కాదు. కష్టపడి చదివి అని. ఇతర స్టూడెంట్లు, సినిమాలకీ, డ్యాన్సులకీ, కాఫీ ఫలహారాలకీ, డబ్బునీ, కాలాన్నీ వ్యయం చేసే సమయాల్లో, రామలింగేశ్వర్రావు, రెండుపూటలు భోజనం తప్ప ఇతరం ఏమీ లేకుండా, చదివి, పాసయినాడు వాడికి డబ్బు అంటే అదోకరకం పూజ్యభావం ఏర్పడి ఉంది మనస్సులో. డబ్బు కోసం నాన్న పడే కష్టాలు వాడికి బాగా తెలుసు. అందువల్లనే రెండే రెండు చొక్కాలతో, పంచలతో, తానే సబ్బున వుతుక్కుంటూ, కాలం గడుపుతున్నాడు. అతన్ని ఇతర స్టూడెంట్లు ఎవరూ అట్టే లెక్క చెయ్యరు. ఏ కొద్దిమందో మాత్రం, అతని నోట్సు పట్టుకెళ్తుంటారు. అట్లాంటివాళ్లలో ఒకడు గోవర్ధనం. ఒక్క చదువు మినహాయిస్తే, రామలింగేశ్వర్రావులో ఆకర్షణీయమైన విషయం ఏదీ లేదనే చెప్పాలి. కొంచెం స్ఫురద్రూపే కాని, అతని నిరాడంబరమైన దుస్తులూ అవీ "గాంధేయం"గా వుండి, ఎవర్నీ ప్రత్యేకించి ఆకర్షించలేక పొయ్యేవి.

పోతే, గోవర్ధనం ఇందుకు శుద్ధ వ్యతిరేకంగా కనిపించేవాడు అతను, ఎప్పుడూ అందరిలాగ నీటుగా, తేటగా, శుభ్రమైన బుష్‌షర్టులూ, పాంటులూ ఇస్త్రీమడత చెరగకుండా తొడిగి, అప్పుడే వికసించిన పువ్వల్లే వుండేవాడు అతని క్రాపుకూడా ఎల్లప్పుడు నున్నగా దువ్వి మెరుస్తుండేది. అతను కాలేజీలో, అన్ని ఫీజులూ ముందుగానే కట్టేసేవాడు. అన్ని పుస్తకాలూ కొనేశాడు. అట్లా 'పంక్చువల్' గా వుండడానికి డబ్బెక్కడిదో?

అంతే కాదు, రామలింగేశ్వర్రావుకి ఇంకో విషయం బహు చిత్రంగా కనిపించేది. ప్రతి సాయంత్రం, గోవర్ధనం నీటుగా ముఖక్షవరం చేసుకుని ఏదో ఓ సినిమాకే గావును వెళ్లేవాడు. తెల్లారి ఆ సినిమా మీద ఓ వుపన్యాసం! వినలేక కడుపులో దేవేది రామలింగేశ్వర్రావుకి. అట్లా జల్సాగా వుండటానికి హేతువైన రాబడి ఏమిటో? వాళ్ల నాన్న ఏ లాండులార్డో, వ్యాపారస్థుడో అయివుండాలి, అనుకున్నాడు రామలింగేశ్వర్రావు

"శారద"

ఇంతకీ, నెలపైనించీ, ఒకే రూంలో వుంటున్నా, రామలింగేశ్వర్రావు గోవర్ధనాన్ని — "మీ నాన్న ఏంచేస్తున్నాడు-" అని అడగనేలేదు. అతని పనేదో అతను చూసుకుంటున్నాడాయె.

"అయినా అతనికి ఇంత దుబారా పనికిరాదు" అనుకున్నాడు రామలింగేశ్వర్రావు. తనతోపాటు వందమంది హాస్టల్లో కామన్ మెస్‌లో భోంచేస్తున్నారు—చవక అని. ఈ గోవర్ధనం అందుకూ వ్యతిరేకమే. తను ఆ విషయం హెచ్చరించకపోయినా ఒకరోజు అతనే చెప్పాడు: "ఈ భోజనం నాకు సయించదండి. అందుకని హోటల్లో భోజనం చేస్తున్నాను" అని.

ప్రతిరోజూ ఉదయం కాఫీహోటలుకి హాజరవుతాడు అతను. రామలింగేశ్వర్రావు కలలోనైనా తలవరాని విషయం అది.

2

అది ఆదివారపు ఉదయం. వానాకాలపు చలిగాలి చల్లగా, బద్ధకం గొలుపుతూ వీస్తోంది. గోవర్ధనం, యథార్థంగా ఆలస్యం గావలసినవాడు: కాని, రామలింగేశ్వర్రావు లేచి మొహం కడుక్కునే టప్పటికే, లేచి స్నానం చేసి, టాయిలెట్ అయి హోటలుకి గావును బయల్దేరుతున్నాడు. బయల్దేరి గడపదగ్గిరకి వెళ్ళినవాడు అప్పుడే మొహం కడుక్కుని లోపలికివచ్చిన తన మిత్రుణ్ణి, వెనక్కి తిరిగివచ్చి భుజంతట్టి పిలిచి," "మిత్రమా, రావోయ్ ఆదివారం పూట కాస్త కాఫీ తాగివద్దాం" అన్నాడు.

రామలింగేశ్వర్రావు నిర్మొగమాటస్థుడు. లేనిది, లేదు అని చెప్పటంలో తప్పే

★ జల్సా పురుషుడు ★

మిటి? అనుకొన్నాడతను. "నేను రాను గోవర్ధనం క్షమించు. నా దగ్గిర చిల్లర డబ్బులు ఉండవు" అన్నాడు నిదానంగా.

గోవర్ధనం పెద్దగానవ్వి, "నేను పిలుస్తున్నానంటే, నేను కాఫీబిల్లు ఇస్తానని అర్థం మిస్టర్. రా." అన్నాడు నిష్కల్మషమైన స్వరంతో.

రామలింగేశ్వరరావు ఒకక్షణం. ఊగిసలాడాడు, వెళ్దామా వద్దా అని. చివరికి ఒక తీర్మానానికి వచ్చి. "ఇవాళ్ళ నువ్విస్తావనుకో, ఆ కాఫీ అలవాటయితే రోజూ! నా తిప్పలు భగవంతునికెరుక! నేను కానయ్యాబాబు. మీరంటే వున్న మహారాజులు, రోజుకు ఐదుమాట్లు తాగినా చెలామణి అవుతుంది!" అన్నాడు చిన్న నిట్టూర్పుతో. గోవర్ధనం, చిరునవ్వు నవ్వుతూ, "కాఫీవొద్దు పోనీ, టిఫిన న్నా చేద్దుగాని రావయ్యా" అని రామలింగేశ్వరరావు చెయిపట్టుకు లాక్కెళ్ళసాగాడు.

రామలింగేశ్వరరావుకి ఇంకా బెట్టుగా వుండటం సబబుగాతోచలేదు. "సరే పద. ఈవార నేను నీకు మళ్ళీ ఒక్క కానీ ఖర్చుపెట్టలేనుగదా అని నా బాధ" అంటూ గదితలుపు తాళం వేసుకుని ఆ గోవర్ధనం వెంట హోటలుకు వెళ్ళాడు. ఆ హోటలు కిటకిట లాడుతోంది అచ్చగా స్టూడెంట్సుతో. రామలింగేశ్వరరావు, గోవర్ధనం. ఇద్దరూ నలుగురు స్టూడెంట్సు కూచున్న ఒక టేబిల్ పక్కన ఇంకో టేబిల్ దగ్గిర కూచున్నారు. ఆ నలుగురూ వీళ్ళిద్దర్నీ చూడగానే చిరునవ్వు నవ్వారు. వాళ్ళల్లో ఒకడు చాలా చిన్న గొంతులో పక్కవాళ్ళతో "బుద్ధుడుగారు ఇవాళ కాఫీ కొచ్చారోయ్. ఇవాళ తుపాను వస్తుంది చూస్కో!" అన్నాడు. నలుగురూ గొల్లున నవ్వారు.

రామలింగేశ్వరరావుకి వాళ్ళు ఎందుకు నవ్వుతున్నారో వెంటనే బోధపడింది. అయినా అతను దీన్నేమీ పట్టించుకోలేదు. వాళ్ళు ఇంకా ఏవేవో మాట్లాడుతూ నవ్వుతూనే వున్నారు.

గోవర్ధనం, తనకి ఒక స్ట్రాంగ్ కాఫీ ఆరరిచ్చి, రామలింగేశ్వరరావుకి, రెండు ఇడ్లలు ఆర్డర్ ఇచ్చాడు.

రామలింగేశ్వరరావు, ఇడ్లీ సాంబారు తింటూ "గోవర్ధనం, నువ్వు ఏమీ తినకుండా వొట్టి కాఫీ తాగుతు"న్నావేం? అని అడిగాడు.

గోవర్ధనం తన మామూలు చిరునవ్వు నవ్వుతూ, "నాకదే అలవాటు. పొద్దున్నే నేనేం తినను." అన్నాడు ముక్తసరిగా.

రామలింగేశ్వరరావుకి అంతా విచిత్రంగా వుంది. ఈ గోవర్ధనంబోటివాళ్ళు ఇంత ఫాషన్‌గా, తిండి తినకండా, కాఫీలు తాగి, చిక్కి శల్యమైపోవటం ఎందుకో అని అర్థంగాదు ఎంతకీ. డబ్బున్నదిగా! తిన దల్చిందేదో తిని ఏడవరాదా? అతను ఆలోచిస్తూ, ఒక ప్లేటు ఉప్మాగూడా తిని, ఇంక ఏమీ వొద్దని లేచాడు. ఆ గోవర్ధనం బిల్లు తీసుకుని వెనకాతే వెళ్ళాడు. వాళ్ళిద్దరు పోతుంటే, రామలింగేశ్వరరావుని ఉద్దేశించి, మిగతా స్టూడెంట్సు, ఏవో వినీ వినపడని మాటలు అనుకుంటూ విరగబడి నవ్వుతున్నారు.

గోవర్ధనం మామూలు చిరునవ్వు మానలేదు. రామలింగేశ్వరరావు, సోమవారం కావల్సిన పాఠాలు జ్ఞాపకం చేసుకుంటూ, తలొంచుకుని నడుస్తున్నాడు.

ఇద్దరూ గడపదగ్గిరకి వొచ్చారు. గోవర్ధనం క్యాషియరుకి బిల్లూ డబ్బులూ ఇచ్చేసి, రామలింగేశ్వరరావు దగ్గిరకొచ్చి "కిళ్లీ వేసుకుంటావా?" అన్నాడు.

"ఎబ్బే వొద్దు బ్రదర్" అనేశాడు రామలింగేశ్వరరావు.

"అయితే, నేను, వెళ్లొస్తా. అట్లా షికారు. నువ్వు రూంకి వెళ్తావుగా" అన్నాడు గోవర్ధనం, మిత్రునిదగ్గిర శెలవ తీసుకుంటూ.

3

సోమవారం కాలేజీకి వెళ్ళేముందె రామలింగేశ్వరరావు, పోస్టాఫీసుకు వెళ్ళాడు, తనకి రావల్సిన మనియార్డరుకోసం. పోస్టుమన్, మనియార్డర్‌కి బదులు, ఓ కార్డు ఇచ్చాడు. అందులో సారాంశం, డబ్బు దొరకలేదనీ, 10 రోజులు ఎట్లాగో తంటాలు పడమనిన్నీ.

రామలింగేశ్వరరావుకి కడుపులో తిప్పినట్టయింది ఆ ఉత్తరం చదివేసరికల్లా. ఆవేళే ఏదో ఫీజు- కట్టాల్సిన ఆఖరురోజు. అప్పటికే ఫైను పడింది. ఇక ఊరుకోరు. ఆ.. లైబ్రరీ ఫీజు. అసలు పుస్తకాలు చదవటానికె తీరిక చాలటంలేదు తనకి. ఈ లైబ్రరీ ఫీజు కూడా ఎందుకో? మహా లైబ్రరీలో తను చదువుతున్నట్టు!

రామలింగేశ్వరరావు గుండె దిటవు చేసుకుని వెళ్ళాడు. ఆవేళటికి గడిస్తే – ఏదో రకంగా క్షమాపణ వేడుకుందాం అని.

కాని, అంతమంది తోటి విద్యార్థుల ఎదుట ఆ ఇంగ్లీషు ప్రొఫెసరు, "నీకు జనరల్ నాలెడ్జి లేదోయ్! ఎట్లా వస్తుందిలే! ఇంతవరకు లైబ్రరీ ఫీజు కట్టలేదుట నువ్వు! వెంటనే ఆ ఫీజు కట్టి, ఎక్కువగా జనరల్ బుక్సు చదువు! రేపు కాలేజీకి వచ్చేటప్పుడు ఆ రసీదు పట్రా!" అని వార్నింగ్ ఇచ్చేప్పటికి, రామలింగేశ్వరరావుకి, యుద్ధభూమిలో కర్ణుడి రథం కుంగిపోతున్నప్పటి బాధ కలిగింది.

వీళ్ళెందుకు గుర్తించరు తన ఆర్థిక బాధని? అని ప్రశ్నించుకుంటూ, అతను రూంకి వొచ్చాడు. అన్నం సరిగా సయించలేదు. రేపు మాత్రం ఫీజు ఎక్కణ్ణించి వస్తుంది? ఏం చెయ్యటం ఇప్పుడు? ఏదో ఒకటి చేసి, ఆ ఫీజు కట్టెయ్యాల్సిందే. కాని, ఆ ఏదో ఒకటి ఏమిటి? ఏమిటి? ఇదే ప్రశ్న అతన్ని వేధిస్తోంది.

రూం, గడియ గట్టిగా వేసుకుని కూచున్నాడు లోపల ఆలోచిస్తున్నాడు. గోవర్ధనం మామూలు ప్రకారం, ఏ సినిమాకో వెళ్ళిపోయినాడు రామలింగేశ్వరరావు ఆలోచన గోవర్ధనంమీదికి పోయింది. "వీడు.. రోజూ ఆ సినిమాలకి తగలేసే డబ్బుపెడ్తే తనకు నెలజీతం వొస్తుంది! అనర్హులదగ్గిర ఇంతింత డబ్బు ఉండటం చిత్రం! అనుకున్నాడు ఆ నిర్భాగ్యుడు. ఆలోచించి ఆలోచించి బుర్ర తిరిగిపోతూ వుంది.

అతనికి అకస్మాత్తుగా ఒక ఆలోచన వచ్చి వొళ్ళు చెమటపోసింది అటువంటి ఆలోచన అదివరలో అతనికి ఎన్నడూ కలిగి వుండదు. "గోవర్ధనం దగ్గిర డబ్బేదయినా ఉంటుంది తనక్కావల్సింది పది రూ॥లు. వాడ్ని అడిగితే ఇస్తాడో ఇవ్వడో! మూడొంతులు ఇవ్వకపోవచ్చు. తనే తీసుకుంటే...పదిరోజుల్లో పైకం అందాక, గుట్టుచప్పుడుగా...అమ్మో...దొంగతనమే ...కాని, ఈ వైరాగ్యంకన్న, కాలేజీలో మర్నాడు రసీదు చూపించకపోతే ఎదురయ్యే సమస్య పెద్దదిగా భూతాకారంగా కనపడింది.

రామలింగేశ్వరరావు ఆలోచించాడు. గోవర్ధనం ఇంకా రెండుగంటల సేపటివరకూ రాడు ఈలోగా వాడి పెట్టితీసి చూస్తే? డబ్బు ఉండేమాట ఖాయం. తనక్కాల్సింది 10 రూ॥! అంతవరకే తీసుకుని,...ఇట్లా ఆ అరగంట సేపట్లో రామలింగేశ్వరరావు, తను డబ్బు తస్కరించే దృశ్యాన్ని పాతికసార్లు ఊహాపథంలో రిహార్సల్సు వేసుకుని, ఎట్టకేలకు ఉపక్రమించాడా పనికి. అదేమంత కష్టమైన పనిగా లేదు. గోవర్ధనం పెట్టె, చిన్న

మిల్లర్ లాక్‌తో తాళం వేసివుంది. దాన్ని రెండునిమిషాలు గట్టిగా లాగేసరికి వూడి వచ్చింది. ఆశ్చర్యం! పెట్టెలో ఒక జత బట్టలు, పుస్తకాలూ వున్నాయ్. ఒక షేవింగ్ సెట్టూ, పౌడర్ డబ్బా, పండ్లపొడి పొట్లం, సబ్బు వున్నాయ్. డబ్బు జాడ ఎక్కడా లేదు.

రామలింగేశ్వరరావు జాగ్రత్తగా బట్టలు తీసి చూశాడు. తర్వాత పుస్తకాలు; ఓ పుస్తకంలో ఓ పదిరూపాయల కాయితం ఒకటి, రెండు రూపాయల కాయితం ఒకటీ ఉన్నయ్. రామలింగేశ్వరరావు చప్పున పది రూ॥ నోటుతీసి తన జేబులో వేసుకుని, పెట్టెని యథాప్రకారం సర్దేశి, తాళం నొక్కేశాడు. ఇంతసేపూ అతనిగుండె దడ దడలాడుతూనే వుంది.

ఆ పైన మళ్ళీ ఆలోచన ప్రారంభమైంది. రేపు గోవర్ధనం పెట్టెలో చూసి, డబ్బు కనపడకపొయ్యేసరికల్లా, గోలచేసి తనను నిలవేస్తే? నిలేస్తాడు! కాని వాడికి తనే తీసినట్టు రుజువేముంది? తనకేమీ తెలియదని బుకాయించవచ్చు....ఇట్లాగే ఆలోచిస్తూ ఆలోచిస్తూ, రామలింగేశ్వరరావు ఆరాత్రల్లా, నిద్రపోనేలేదు. నిద్రపోయిన కాసేపు పీడకలలు వచ్చినయ్.

4

తెల్లారి $7\frac{1}{2}$ దాకా గోవర్ధనం నిద్రలేవలేదు. రామలింగేశ్వరరావు మాత్రం, మామూలుకన్న పెందలకడే లేచి కాలకృత్యాలలో నిమగ్నుడైనాడు. అతను స్నానం చేసి గదిలోకి వచ్చేటప్పటికి, గోవర్ధనం, పెట్టె తెరిచి, వెతుకుతున్నాడు; అతడికళ్లు జ్యోతుల్లాగున్నాయ్ "వుంటవూ మరి? ప్రతిరాత్రి రెండుఆటలూ చూస్తే" అని రామలింగేశ్వరరావు అనుకున్నాడు.

గోవర్ధనం పదినిమిషాలు పెట్టంతా గాలించాడు. పుస్తకాలన్నీ తీసి దులిపాడు. రెండురూపాయల కాయితం ఫిజిక్స్ నోట్సుపుస్తకంనుంచి కిందపడింది. అతని మొహం ఎన్నడూ లేనంతగా పాలిపోయింది. అసలే నెత్తురుతక్కువ మనిషి. పెద్దబలిష్ఠుడూ కాదు

అతను తుదకి ఇహ పదిరూ॥ లు పోయినయ్యని తేల్చుకున్నాక, సన్నని కీచు గొంతుతో "రామలింగేశ్వరావు, రాత్రి గదిలోకి ఇంకెవరన్నా వచ్చారా?" అని ప్రశ్నించాడు. అతడికి సూటిగా, తన మిత్రుడిమీద నేరారోపణ చెయ్యటానికి భయం వేసింది.

"ఎవరూ రాలేదే! ఎందుకూ అట్లా అడుగుతున్నావు, ఎన్నడూ లేని ప్రశ్న?" రామలింగేశ్వరరావు, సాధ్యమైనంతవరకు తన భావాల్ని దాచుకుంటూ, సహజంగా అడిగాడు.

"నా పెట్టెలో పదిరూపాయల నోటు కనపట్టంలేదోయ్!" అన్నాడు గోవర్ధనం విచారంగా.

"అరెరే!...పెట్టెలోది ఎట్లా పోతుందయ్యా? తాళం వేశావా సరిగ్గా? లేక ఇంకెక్కడన్నా పారేసుకున్నావా? సరిగా జ్ఞాపకం చేసుకో." అని సలహా ఇచ్చాడు, రామలింగేశ్వరరావు, తడిబట్టలు దణ్ణెంమీద ఆరవేస్తూ. బయట వానచినుకులు పడుతున్నయ్.

గోవర్ధనం, చాలా నిశ్చయంగా,"పొరపాటేమీ లేదోయ్. సోమవారం ఉదయమే, పెట్టెలో పెట్టాను. నాకు బాగా గుర్తు. 12 రూ॥ పెట్టాను. ఇదిగో రెండురూపాయల కాయితం వుండనేవుంది. ఆ పది కాయితమే మాయమైపోయింది!"అన్నాడు రాజ్యం పోగొట్టుకొన్న రాజుకి మల్లె వుంది అతని వైఖరీ స్వరమున్నూ. అంతకన్నాకూడా, అత్యంత విషాదం అతనిలో వున్నటు రామలింగేశ్వరరావుకి తోచింది. కాని అతను ధ్రువపర్చుకున్నాడు మనసును. "వీడు జల్సాచేసేదాంట్లో ఇది ఎన్నోవంతు! రేపీపాటికి మళ్లీ వందలు తెప్పించుకొంటాడు." అని సర్దుకొన్నాడు.

గోవర్ధనం రెండోమాట మాట్లాడకుండా మామూలుగా స్నానం చేసి, గుడ్డలు వేసుకుని, బయటకి వెళ్లిపోయినాడు. అతనిలోనుంచి, అతని 'పేటెంటు' చిరునవ్వు మాయమైనట్టు రామలింగేశ్వరరావు గుర్తించకపోలేదు.

రామలింగేశ్వరరావు ఆపూటే లైబ్రరీఫీజు కట్టేశాడు. కాలేజీలో, ఇంగ్లీషు ప్రొఫెసరు అతన్ని రసీదు చూపించమని అడగలేదు. అతని జేబులో రసీదు వున్నది. గోవర్ధనం గూడా కాలేజికి వొచ్చాడు. అతనిలో ఏదో విపరీతమైన ఆందోళన ద్యోతకమైంది. అతని ఆలోచన్లు, కాలేజీ లెక్చర్లమీద నిలవలేదు.

5

గోవర్ధనం, ఆవేళ సినిమాకి వెళ్లలేదు. కాలేజీనుంచి సరాసరి, రూంకి వొచ్చేశాడు. రామలింగేశ్వరరావు ఏదో థియరీ బటీ పెడుతుండగా, గోవర్ధనం నీరసంగా

(56-వ పేజీ చూడండి)

ఆ దగ్గును అణచండి-ఆ గొంతుపుండుకు ఉపశమనం కలిగించి మాన్పండి-రొమ్ము, శ్వాసకోశ బాధలను వెంటనే తొలగించండి

పెప్స్ సేవించండి.

PEPS

జగద్విఖ్యాతి గాంచిన

గొంతు, రొమ్ము టేబ్లెట్లు.

మందు అమ్మేవారి అందరివద్దా లభిస్తాయి



పెప్స్ టేబ్లెట్లు గొంతు, రొమ్ము బాధోపశమన, నివారక సారములు కలవి. మీరు పెప్స్‌ను చప్పరించునపుడు ఈ సారములు ఆవిరిఅయి, మీ శ్వాసద్వారా గొంతుకలోనికి, శ్వాసమార్గం, శ్వాసకోశాలలోనికి కొనిపోబడుతాయి. ఇలా అవి సరాసరి మిమ్ము బాధించే భాగాలను చేరుకుంటాయి. అందుకే పెప్స్ అంత శక్తివంతమై, జగద్విఖ్యాతి గాంచినవి. పెప్స్ దగ్గులను అణిచివేస్తాయి, గొంతుపుండు బాధను ఉపశమింపజేస్తాయి, కఫమును కోసివేసి, శ్వాసబాధను పోగొట్టుతాయి. ఇన్‌ఫ్లుయేంజా, బ్రోంకైటిస్ చికిత్సకు ఇవి అమోఘమైనవి.

మద్రాసు పోల్ ఏజంటు: దాదా & కంపెనీ, పార్కుటౌను, మద్రాసు-3.

జల్సా పురుషుడు

(25-వ పేజీ తరువాయి)

పక్కకు తిరిగి పడుకుని నిద్రా, మగతా లేని స్థితిలో వున్నాడు. రామలింగేశ్వరరావుకి థియరీ బుర్రకెక్కటంలేదు. తన దొంగతనం గోవర్ధనానికి తెలిసిపోయిందేమో! ఎదురుగుండా అతన్ని చూస్తూ రామలింగేశ్వరరావు చదువు సాగటంలేదు. వీరు సినిమాకన్నా పోలేదు! ఈ రూంలోకి ఇద్దరూ ప్రవేశించాక, ఇదే వాడు సినిమాకి వెళ్ళని మొదటి రాత్రి, సినిమా గురించి మాటాడని మొదటి రోజూను. రామలింగేశ్వరరావుకి వుండబట్టలేదు. కుంపటిమీద కూర్చున్నట్టు వుంది. తనంత మంచివాడు లేడని కాలేజీ లెక్చరర్ల అభిప్రాయం. అదే అభిప్రాయం గోవర్ధనానికి వున్నది. అది కాస్తా ఈరోజున ఎగిరిపోతుందా ఏం? కాని రుజువేమీ లేదు. గోవర్ధనానికి తన మీద నేరం మోపటానికి... కానీ లోలోన చిన్నతో, జల్సాగా గోవర్ధనంమీద రామలింగేశ్వరరావుకు కోపమూ వచ్చింది. అంత జల్సాగా వుండటం ఎందుకు, వాటికి కాస్త అవాంతరం వొచ్చేసరికి ఇట్లా బేజారై పోవటం ఎందుకు? ఇట్లాంటివాణ్ణి, తను ఆ పది ఇవ్వమని అడిగితే ఇచ్చేవాడేనా? చస్తే ఇవ్వడు; వాడికేం తను చదవకపోతే?

గోవర్ధనం, రెండుమూడుమార్లు అటూ ఇటూ దొర్లి పడుకున్నాడు. బయట వాన కురుస్తోంది. నెల్లూరు ముసురుబడిపోయింది. రామలింగేశ్వరరావు లేచి, ఎలక్ట్రిక్ లైటు స్విచ్ నొక్కి, మళ్ళీ పుస్తకం ముందేసుకు కూచున్నాడు.

బయట, సైకిల్ బెల్ మోగింది. అది పోస్టుమెన్ సైకిల్ అని ఆ ప్రత్యేకమైన శబ్దం ద్వారా గుర్తించిన ఇద్దరు మిత్రులూ ఆత్రంగా పరిగెత్తారు బయటికి. టెలిగ్రాం వొచ్చింది గోవర్ధనానికి. అతడు లోపలికి ఒక్క పరుగున వొచ్చి పక్కమీదపడి దొర్లుతూ ఏడవసాగాడు. రామలింగేశ్వరరావుకి ఏమీ తోచలేదు. "గోవర్ధనం! ఏమిటది? నాతో చెప్పు! ఆ టెలిగ్రాం ఏది - నన్ను చూడనీ!" అని వోదారుస్తూ, గోవర్ధనాన్ని లేపి కూచోబెట్టాడు.

గోవర్ధనం టెలిగ్రాం రామలింగేశ్వరరావుకి ఇవ్వలేదు. అతడి మొహం, ఆ ఐదు నిమిషాల్లో మరింత పాలిపోయి, పదేళ్ళ వయసు పెరిగినవాడల్లే తయారైంది.

అతని నోటంబడి మాట రావటానికి ఇంకో ఐదు నిమిషాలు పట్టింది. "ఆ పది రూపాయలూ పోకుండా ఉన్నట్టయితే!"

రామలింగేశ్వరరావు గుండె ఝల్లుమన్నది. దానికీ దీనికీ ఏమిటి సంబంధం?... "ఏమిటి గోవర్ధనం? సరిగ్గా చెప్పు! విచారపడకు!" అనగలిగాడు.

గోవర్ధనం, విరక్తిగానూ, చిరాగ్గానూ లేని నవ్వు నవ్వి, "అవును. ఆ పది పంపించేసి వుంటే.. నిన్ననే ఆ పది వొచ్చివుంటే..." అంటూ రామలింగేశ్వరరావువైపు తీవ్రంగా చూస్తూ, "నీకు డబ్బు విలువ బాగా తెలుసుగదూ!" అన్నాడు.

రామలింగానికి క్షణం ఒక యుగంగా వున్నది. "ఊఁ" అన్నాడు నీరసంగా.

"ఆ పది రూపాయల కోసం నేను, 6 రోజులు పని చెయ్యాలి" అన్నాడు గోవర్ధనం, చొక్కా లేని తన అస్థిపంజరపు శరీరంవంక చూస్తూ.

"ఏమిటది?" రామలింగేశ్వరరావుకి ఏమీ అర్థం కావటంలేదు. అయినా, అతడు మెల్లగా, "డబ్బు విలువతో నీకేం పని వొచ్చింది? జల్సాగా..."

గోవర్ధనం పూర్తిగా విచ్చిపోయాడు. "అదే నీ వుద్దేశం. నేను, రోజూ సినిమాల కెళ్తున్నానని, నా డబ్బు మంచినీళ్ళల్లే వ్యయమౌతున్నదనీను! అట్లా కనిపిస్తే కాని, ఈ నా తోటివర్గంలో బతకటం దుర్భరం! నేను. ఆ పదిరూపాయలు దేనికోసం ఉంచానో తెలుసా?"

"తెలీదు. బహుశా, సాదరు ఖర్చుకోసం ఐవుంటుంది!" అన్నాడు మిత్రుడు.

"సాదరు! అంతకన్నా నాకున్న అవసరాలు వేరేవుంటాయని నీకు తోచదు!" గోవర్ధనం అరిచాడు. "నా చెల్లెలి మందు సీసా కొనటానికోసం వుంచాను అది...

ప్రతిరాత్రి ఆ విశాలా ప్రెస్‌లో ఫీడర్ పని చేసి, గూడా సంపాయించి నా ఖర్చులు జరుపుకుంటూ అమ్మకికూడా పంపించాలి. ఆమె వంటచేసి సంపాయించేది, చాలదు! నా ఖర్చు వీలయినంత తగ్గించాను పొద్దున ఒక్క కాఫీ— మధ్యాహ్నం భోజనం— నెలకు 15 రూ॥ రాత్రి ఒక "టీ" నెలసరికి 4 సార్లు ఇస్త్రీ గుడ్డలకు 2 రూ॥ లు. క్షవరానికి బేడ రూపాయి— డబ్బు లేకపోయినా డాబు సరిగా కనపడుతూ, ఇంకెవర్నీ ఏమీ అడగకుండా,..." గోవర్ధనం ఇంకా పూర్తి చెయ్యలేదు.

గోవర్ధనం కళ్ళవెంట నీటిచుక్కలురాలినై. "చెల్లెలు చనిపోయింది. మందు అందలేదు. లివర్ ప్రబద్ధలైనదని డాక్టరు చెప్పారు." ★

★ కాలక్షేపం ★

(4-వ పేజీ తరువాయి)

లోని షరాబును పరిపరివిధాల ప్రతిమాలినాడు. కాని, అతను రూల్సుప్రకారం వీలులేదన్నాడు. కాని రంగారెడ్డి బ్యాంకులో పెద్ద ఖాతాదారు. నాటి షాహుకార్లందరూ, ఆఖరు క్షణంలో వచ్చిన ఆసాములందరూ, హాయిగా పైకం జమకట్టుకొని దాచుకొని పని పూర్తిచేసుకొని కూర్చుండడం చూస్తే కడుపుమండడం ప్రారంభించింది రంగారెడ్డికి. సరాసరి సాగ్రహావేశపరభాషమానుడై షరాబుపై అధికారియైన బ్యాంకు ఏజంటువద్దకు వెళ్ళాడు. ఆయనను తన మాటల ధాటితో మెప్పించి,ఒప్పించి,షరాబువద్దకు రప్పించి షరాబుకు చెప్పించి, తన పదివేల పైకమును మరునాటి తేదీతో తన ఖాతాలో జమ కట్టం చెడి కట్టుదిట్టము చేసి, ఆ తెల్ల రసీదును మాత్రము బ్యాంకు ఏజంటువద్ద తీసికొని, నాటి షాహుకార్లమీదసవాల్ చేసి, "చూచుకోండి! నా సత్తా! పైపుచ్చుకొన్నాడా లేదా? మీరందరూ పది వేలు జమ కట్టించి కూర్చుంటె మీకు ఈ సమ ఉజ్జీని కొనసాగుతున్నారా? దేనికైనా రంగారెడ్డి అంటె చెంగ పెట్టుకొని కూర్చుండేఘటం కాదు" అని ఎత్తి ప్రకటించాడు. గగ్గోలుగా ఉంది. "అర్బత్ నాట్ బ్యాంకు దివాలా!" అని ఊరంతా ఒకటే హోరుగా ఉంది. ఇంకేముంది! అర్బత్ నాట్ దివాలా! రంగారెడ్డి దివాలా! అతని గతిలోని జవం— నిర్జీవమైపోయిన వదనం. బ్యాంకు సింహద్వారంవద్ద నిలువబడ్డాడు. కాని బ్యాంకుతలుపులు బంధించి ఉన్నాయి. అతనితలపులు పరుగెత్తుతున్నాయి. ధైర్యము విలోలంబయ్యె - మూర్ఛ వచ్చె తనువున్ డస్సెన్—గజేంద్రునివంటి, మత్తమాతంగమువంటి రంగారెడ్డి స్వగ్రామానికి స్వజన సహాయంతో చేరాడు. రంగారెడ్డికి పోయింది లక్షకు పైగా. కాని లేనివాడు కాడు యిప్పటికినా - అయితే ఏం? అతనికి దిగులు మిగిలింది ఆ దిగులు పగలూ రాత్రీ వడ్డీ పెరిగినట్టుగా పెరిగింది. ఆస్తి బాధ అప్పుబాధకంటె అధికమై అతనినే ఆఖరుకు "స్వాహా!" అంది.

ధనంకోసం తపస్సు చేయవచ్చు, కృషి చేయవచ్చు. కాని, ధనకాంక్ష తన్ను తపింపజేసి దహింపచేసినప్పుడు, దీన వదనంతో ఉన్నవాడు ధైర్యహీనుడై లేనివాడవుతాడు. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras